www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 21 ఏప్రిల్ 2025
5
వైఎస్ఆర్

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

ప్రజాశక్తి - కడప

ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను సోమవారం సభాభవన్‌లో నిర్వహించనున్నట్లు డిఆర్ఒ విశ్వేశ్వర నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామని తెలిపారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో కూడా సమర్పించవచ్చునని తెలిపారు.

డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని ఉదయం 9.30 నుండి 10 గంటల వరకు నిర్వహిస్తామని ప్రజలు 08562-244437 నెంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలను విన్నవించుకోవచ్చు అని తెలిపారు.

ఆటోవాలా..ఢీలా!

- ఎన్నికల హామీ నెరవేర్చని కూటమి ప్రభుత్వం
- ఏటా రూ.15 వేలు ఇస్తామని పది నెలలైనా ఇవ్వని వైనం
- అమలు చేసి ఆదుకోవాలంటున్న ఆటో డ్రైవర్లు

స్టాండ్‌లో ఉన్న ఆటోలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ఆటో డ్రైవర్ల పరిస్థితి ఆగమ్యగోచరంగా తయారైంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తరచూ పెట్రోల్, డీజిల్ ధరలు పెంచుతుండటంతో తిప్పలు తప్పడం లేదు. ప్రస్తుతం లీటర్ డీజిల్ ధర రూ.99, పెట్రోల్ రూ.110 వరకూ ఉంది. దీంతో ఆటోలను నమ్ముకుని జీవనం కొనసాగిస్తున్న కార్మికులు బెంబేలెత్తిపోతున్నారు. నియోజకవర్గంలోని సింహాద్రిపురం మండలంలో 48 ఆటోలు, లింగాల 28, చక్రయపేట 35, తొండూరు 25, వేముల 24, వేంపల్లి 105, పులివెందుల పట్టణ పరిధిలో 180 ఆటోలున్నాయి. బస్సులు లేనప్పుడు ప్రయాణికులు ఆటోలపైనే ఆధార పడి గమ్యస్థానాలకు చేరుతున్నారు. ముఖ్యంగా ఆర్‌టిసి బస్సులు లేని గ్రామీణ ప్రాంతాలకు ఆటోలే ఆధారం.

తగ్గిన ఆదాయం.. పెరిగిన ఖర్చులు

ఆటో నిర్వహణకు సాధారణంగా ఖర్చులుంటాయి. ప్రస్తుతం పెరుగుతున్న డీజిల్, పెట్రోల్ ధరలతో ఆటో కార్మికుడికి రోజంతా కష్టపడితే రూ.200 నుంచి రూ.300 కూడా మిగలని పరిస్థితి నెలకొంది. ఏటా ఇన్సూరెన్స్, ఫిటెనెస్, సర్టిఫికెట్ల కోసం దాదాపు రూ.15 వేల దాకా ఖర్చువుతుంది. వీటితో పాటు తనిఖీల పేరుతో పోలీసులు, రవాణా శాఖాధికారులు దాడులు చేసి రూ.వేల జరినామా విధించడం, ఆటో కొనుగోలు కోసం తీసుకున్న రుణాలకు నెలవారీ కంతులను కట్టుకోలేక ఆటో కార్మికుల బతుకులు దినదిన గండంగా మారిపోయాయి. వచ్చే అరకొర డబ్బు ఇంధనం, ఇతర ఖర్చులకే పోతు న్నాయని వాపోతున్నారు.

ఆటో కార్మికులపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం

కష్టాల్లో ఉన్న ఆటో కార్మికులకు ఆదుకునే విషయంలో చంద్రబాబు ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆటోకార్మికులు విమర్శిస్తున్నారు. ఆటో కార్మికులకు ఏడాదికి రూ.15 వేలు చొప్పున ఇస్తామని, ప్రత్యేకంగా సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని ఎన్నికల్లో చంద్రబాబు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి 10 నెలలు గడుస్తున్నా హామీ అమలు చేయడం లేదని మండిపడుతున్నారు.

గత ప్రభుత్వంలో భరోసా

ఎన్నికల హామీ మేరకు గత ప్రభుత్వంలో రాష్ట్ర బడ్జెట్లో ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం ఏటా బడ్జెట్ కేటాయించి అర్హులైన ఆటో, టాక్సీ, మాక్సీక్యాబ్ డ్రైవర్లకు ఏడాదికి రూ. 10 వేలు చొప్పున వారి ఖాతాల్లో జమచేసి ఆదుకున్నారు. దీంతో పాటు వాహన డ్రైవర్ ప్రమాదవశాత్తు మృతి చెందితే వారి కుటుంబ సభ్యులకు రూ.10 లక్షల బీమా వర్తింపజేశారు. అలాగే రవాణా వాహన కొనుగోలుకు బ్యాంకు నుంచి రుణాలు తీసుకునే డ్రైవర్లకు రూ. 3 లక్షల వరకు వడ్డీరాయితీ అందించారు.

- శీను, ఆటో డ్రైవర్, పులివెందుల

రూ.15 వేలు ఇవ్వాల్సిందే

రోజంతా కష్టపడి ఆటో తోలినా కుటుంబ పోషణ కష్టంగా మారింది. నిత్యావసర సరుకులతోపాటు ఇంధన ధరలు పెరిగిపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అప్పు చేసి ఆటో కొనుగోలు చేసి వాటి ఫైనాన్స్, పెరిగిన బీమా ప్రీమియం. రోడ్డు ట్యాక్స్‌లు కట్టుకోలేక ఆటోలను నడపలేకపోతున్నాం. ఎన్నికల హామీ మేరకు ప్రభుత్వం ఆటో కార్మికులకు రూ15 వేలు చొప్పున ఇవ్వాలి.

- శేఖర్, నాలుగు చక్రాల ఆటో డ్రైవర్ , పులివెందుల

కుటుంబ పోషణ భారం

15 ఏళ్లుగా ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాం. డీజిల్, పెట్రోల్ ధరలు ఆకాశాన్ని అంటుతున్న తరుణంలో కుటుంబ పోషణ భారంగా మారింది. దీనికి తోడు గతంలో మాదిరి ప్రస్తుతం ఆటోలకు అంతగా గిరాకీ ఉండడంలేదు. ఇలాంటి పరిస్థితి నుంచి ఆటోడ్రై వర్లకు ఆర్థికంగా సాయం చేయాలి. మమ్మల్ని ప్రభుత్వమే ఆదుకోవాలి.

- పవన్, ఆటో డ్రైవర్, పులివెందుల

డ్యామేజీ పనులకు ప్రాధాన్యత

- 1.20 లక్షల ఎకరాలు సాగులోకి తేవాలి
- టిజిపి కాల్వలో నీటి సరఫరాను మెరుగుపరచాలి
- తెలుగుగంగ ప్రాజెక్ట్స్ సూపరింటెండెంట్ వెంకటరామయ్య

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ముఖా ముఖి..

బ్రహ్మంసాగర్ కాల్వల డ్యామేజీ పనులకు ప్రాధాన్యత ఇస్తాం. ఈమేరకు రూ.54 కోట్లతో మరమ్మతులను పూర్తి చేయడంపై దృష్టి సారించాం. దీంతో 1.20 లక్షల ఎకరాలకు నీరందించడమే ధ్యేయంగా ముందుకెళ్తున్నాం. ఇందుకుగానూ జిబిఐ, ఒబిసి పనుల్లో కదలిక నేపథ్యంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. నంద్యాల-కడప జిల్లా సరిహద్దు ప్రాంతంలోని 98 కి.మీ నుంచి 108 కి.మీ వరకు కాల్వల పనుల్ని పూర్తి చేస్తే పూర్తి స్థాయిలో ఆయకట్టుకు నీరందించే అవకాశాలు ఉంటాయని పేర్కొంటున్న తెలుగుగంగ ప్రాజెక్ట్స్ సూపరింటెండింగ్ ఆఫీసర్ వెంకటరామయ్యతో ముఖాముఖి...

బ్రహ్మంసాగర్ నిల్వ సామర్థ్యం ఎంత?

17 టిఎంసిల నిల్వ సామర్థ్యాన్ని కలిగి ఉంది. ప్రస్తుతం అనుబంధ రిజర్వాయర్లలోని నిల్వలతో కలిపి లెక్కిస్తే 6.8 టిఎంసిల నుంచి 8.2 టిఎంసిలు నిల్వ ఉంది.

బ్రహ్మంసాగర్ ఆయకట్టు విస్తీర్ణమెంత?

బ్రహ్మంసాగర్ కింద 1.56 లక్షల ఎకరాల విస్తీర్ణం ఉంది. ఇందులో 96 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నాం. మిగిలిన 60 వేల ఎకరాల ఆయకట్టు ఎస్ఆర్-1, ఎస్ఆర్-2 రిజర్వాయర్లు, ఎడమ, కుడి కాల్వల పరిధిలో ఉంది.

పెండింగ్ పనుల పురోగతి ఎలా ఉంది?

బ్రహ్మంసాగర్ జిబిసి, ఓబిసి ప్రాంతాల్లోని పెండింగ్ పనులు వేగవంతం చేయాలి. గతంలో ఒబిసి ప్రాంతాల్లోని పెండింగ్ పనుల్ని చేపట్టడానికి కాంట్రాక్టర్ ముందుకు రావడంతో పనులు పట్టాలకు ఎక్కించాం. కానీ నిధుల చెల్లింపుల సమస్య కారణంగా నిలిచిపోయాయి. జిబిసి కాం ట్రాక్టర్ ముందుకొస్తే 50 వేల ఎకరాల ఆయకట్టుకు నీరందించే అవకాశం ఉంది. ఇందులోభాగంగా జిబిసి కింద 20 వేల ఎకరాలు, ఓబిసి కెనాల్ ప్రాంతంలో 10 వేల ఎకరాలు వెరసి 30 వేల ఎకరాల ఆయకట్టు అందు బాటులోకి రానుంది.

లైనింగ్ పనుల పరిస్థితి ఏమిటి?

బ్రహ్మంసాగర్ కుడి కాల్వ 15 కిలోమీటర్లు, ఎడమ కాల్వ 58 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. రూ.9.7 కోట్లతో ఎడమ కాల్వ లైనింగ్ పనుల్లో 50 శాతంతో నిలిచింది. నాలుగు దఫాలుగా పిలిచిన టెండర్లలో జెకె కన్స్ట్రక్షన్ పనులు దక్కించుకుంది. రూ.10 కోట్లతో కుడి కాల్వ పనులు చేపట్టాల్సి ఉంది. నెలాఖరులోపు పెండింగ్ బిల్లుల చెల్లింపులకు అవకాశం ఉంది.

లీకేజీ మరమ్మతు పరిస్థితే ఏమిటి?

రూ.57 కోట్లతో ప్రతిపాదనలు పంపించాం. లీకేజీ ప్రాంతాల్లో 36 ఫిల్లర్లను ఏర్పాటు చేయడమైంది. పోలవరం అథారిటీ నిపుణుల నుంచి అందే సూచనలు, సలహాలను బట్టి ముందుకు వెళతాం. దీంతో పాటు మరో 100 మీటర్లలో చెమ్మ తగిలిన ప్రాంతాన్నీ గుర్తించడమైంది. గ్రౌటింగ్ ప్రక్రియ సహాయంతో చెమ్మను అరికట్టే ప్రయత్నాలు చేపడుతున్నారు.

కుందూ-పెన్నా లిఫ్టు గురించి చెప్పండి?

కుందూ-పెన్నా ఎత్తిపోతలకు నిధులపై దృష్టి సారించాం. 56 ఎకరాల భూసేకరణ అనంతరం ఎత్తిపోతల పనులు ఊపందుకునే అవకాశం ఉంది. ఎత్తిపోతలను పూర్తి చేసిన అనంతరం ఎనిమిది టిఎంసి లను ఎత్తిపోసే అవకాశం ఉంది.

సర్‌ప్లస్ గేట్ ఏర్పాటు ఎప్పుడు?

బ్రహ్మంసాగర్ సర్‌ప్లస్ గేట్ సెంట్రల్ డిజైనింగ్ ఆఫీసర్స్ సర్వే చేసి ప్రతిపాదనలు పంపించాం. డ్రాయింగ్ సెక్షన్ నుంచి అప్రూవల్ లభించాల్సి ఉంది.

ఆదివాసీల సంపదను దోచుకునేందుకు కుట్ర

ప్రజాశక్తి-కడప అర్బన్

మాట్లాడుతున్న సిపిఐ (ఎంఎల్) ఎపి అధికార ప్రతినిధి ప్రసాద్

ఆదివాసీల సంపదను దోచుకునేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కుట్ర పన్నుతుందని సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ ఎపి ప్రతినిధి ప్రసాద్ అన్నారు. ఆదివారం దండకారణ్యంలో భారత ప్రభుత్వం 'ఆపరేషన్ కగార్' పేరుతో ఆదివాసీలపై చేస్తున్న మారణ హోమాన్ని ఆపాలని, ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని గుర్రాల గోపాల్ అధ్యక్షతన ఇంజినీర్స్ భవన్‌లో కడప జిల్లా ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ముఖ్య వక్తగా హాజరైన ప్రసాద్ మాట్లాడుతూ దండకారణ్యం ఈ దేశ జనుల సహజ వారసత్వ సంపదని పేర్కొన్నారు. ఆదివాసీలను మావోయిస్టుల పేరుతో అంతమొందించి, బహుళ జాతి సంస్థల కార్పోరేట్ ప్రక్రియను వేగవంతం చేసి విలువైన ఖనిజ సంపదలను దోచిపెట్టి ఆదివాసులను 1,54,000 చదరపు కిలోమీటర్ల భూభాగంలో నిర్వాసితులను చేసే అమానుషకృత్యమని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మధ్య భారతంలోని దండకారణ్యంలో మావోయిస్టుల ఏరివేత పేరుతో ఆపరేషన్ కగార్ ను చేపట్టాయన్నారు. ఆపరేషన్ కగార్‌ను వ్యతిరేకించ వలసిన బాధ్యత భారత దేశ ప్రజలందరిపైన ఉందన్నారు. బిజెపి ప్రభుత్వం చేపట్టిన ఆదివాసీ, కార్మిక, ముస్లిం మైనార్టీ వ్యతిరేక మతతత్వ విధానాలను విమర్శించారు. విప్లవ రచయితల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వరలక్ష్మి మాట్లాడుతూ అభివృద్ధి పేరుతో అటవీ ప్రాంతాలలో ఆదివాసీల నివాస ప్రాంతాలను తొలగిస్తూ, ఆరు వరుసల రహదారులను నిర్మించడం ప్రభుత్వం కార్పోరేట్ల ఖనిజ తవ్వకానికీ, రవాణాకు మాత్రమేనని తెలిపారు. ఆదివాసీలను తమ గ్రామాల నుంచి తొలగించి వారి సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక జీవితాన్ని చిన్నాభిన్నం చేసి వారిని పరాయికరణకు గురిచేస్తుందని చెప్పారు. సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ మాట్లాడుతూ శాంతి చర్చలను వెంటనే ప్రారంభించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. అ దండకారణ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని, ఆర్టికల్ 244, 244-ఎ ప్రకారం ఆదివాసి గ్రామసభల తీర్మానాల ద్వారా మాత్రమే అభివృద్ధి పనులు చేప ట్టాలని, శాంతి చర్చలను మధ్యవర్తుల సహకారంతో వెంటనే ప్రారంభించి కాల్పుల విరమణ పాటించాని దండకారణ్యంలో మావోయిస్టుల పేరుతో చేస్తున్న హత్యాకాండను తక్షణమే ఆపాలని తీర్మానించారు. సదస్సులో పౌర హక్కుల సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చీమలపెంట వెంకటేశ్వర్లు, ఎరుకల హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకులు ద్రాక్షం శ్రీనివాసులు, ఎన్ఆర్‌సి, సిఎ జాయింట్ యాక్షన్ కన్వీనర్ బాబు బాయ్, ప్రజాస్వామ్యవాదులు పాల్గొన్నారు.

ఉచిత మెగా డిఎస్‌సి కోచింగ్ : యుటిఎఫ్

ప్రజాశక్తి - కడప అర్బన్ : యుటియఫ్ కడప జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఉచిత డిఎస్‌సి కోచింగ్ ఇవ్వనున్నట్లు యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబు తెలిపారు. ఆదివారం యుటిఎఫ్ భవన్‌లో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ విద్య బలోపేతమే బాధ్యతగా, పాఠశాలల పరిరక్షణ పరమావధిగా, బడుగు, బలహీన వర్గాలకు బాసటగా, నాణ్యమైన విద్యను బోధించుటకు అవసరమైన నవతరం ఉపాధ్యాయులను తీర్చిదిద్దడమే లక్ష్యంగా డిఎస్‌సి బోధనలో ఉభయ రాష్ట్రాలలో ఉద్దండులైన, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయ బృందంచే ఉచిత డిఎస్‌సి కోచింగ్ సెంటర్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 24న ఉదయం 9:30 గంటలకు ఫ్రీ డెమో తరగతులను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. డిఇఒ షంషుద్దీన్ హాజరై తరగతులు చెబుతారని తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 23 లోపు కె.నరసింహా రావు 9440384701, గాజులపల్లి గోపీనాథ్ 9885125056 నంబర్లకు ఫోన్ చేసి రిజిస్ట్రేషన్ కాగలరని తెలిపారు. కార్యక్రమంలో ట్రెజరర్ కె.నరసింహారావు, జిల్లా కార్యదర్శి ఎస్.ఏజాస్ అహమ్మద్, ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎం.ప్రభాకర్, జిల్లా సీనియర్ నాయకులు పి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఘనంగా ఈస్టర్ వేడుకలు

ప్రజాశక్తి - కడప : కడప నగరం 48 డివిజన్ కృపా కాలనీలో న్యూ నేటివ్ కృపా మినిస్ట్రీస్ అధ్యక్షులు పాస్టర్ పి.మహేష్, సిస్టర్ శాంతమ్మల ఆధ్వర్యంలో ఆదివారం ఈస్టర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దైవజనులు పి.మహేష్ మాట్లాడుతూ క్రీస్తు రాకతో చరిత్ర ప్రభా వితమైందన్నారు. క్రీస్తు శకం, క్రీస్తు పూర్వంగా చరిత్ర పుటల్లో ఏసు నిలిచిపోయరని చెప్పారు. అనంతరం భక్తులందరికీ ఉచితంగా హోలీ బైబిల్స్ పంపిణీ చేసి, పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో విశ్వాసులు పి.రవితేజ, శాంతిరాజు, రామంజినమ్మ, జి.కిరణ్, జి.శిరీష నరసయ్య, శ్రీను, సుగుణమ్మ, రోజా పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి బియ్యం వితరణ

ప్రజాశక్తి -కడప అర్బన్ : నగరంలోని బృంద స్ఫూర్తి వృద్ధాశ్రమానికి వైవీయూ ప్రిన్సిపల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో పది సంచుల బియ్యం బస్తాలను ఆదివారం వితరణ చేశారు. వైవీయూ ఆచార్యులు ఎం.వి. శంకర్, డా. వెంకట్రామ్, సహ ఆచార్యులు ఎం. సుభోష్ చంద్ర, వేనూస్ స్కిల్ అకాడమీ వేణుగోపాల్, రవికుమార్ రెడ్డి, శ్రీనివాస ఎంబిఎ కళాశాల ప్రిన్సిపల్ డా. జె.మునయ్య, డా. సిరాజుద్దీన్ సుబ్బారెడ్డి, వేణుగోపాల్ , కెఎస్ఆర్ఎం నరేష్ మసూర బియ్యం పది బస్తాలను బృంద స్ఫూర్తి ఫౌండేషన్ వ్యవస్థాపకులు న్యాయవాది బాలసుబ్బయ్యకు అందజేశారు. పలు సేవా కార్యక్రమాల నిర్వహణలో భాగంగా వృద్ధాశ్రమమానికి వచ్చినపుడు బియ్యం కావాలని కోరారని, ఆ మేరకు వాటిని అందజేశామని పేర్కొన్నారు. భవిష్యత్తులో తమ సహకారం ఉంటుందని ఆచార్య రఘునాథ రెడ్డి హామీ ఇచ్చారు. వృద్ధులకు ఆరోగ్య జాగ్రత్తలు తెలిపారు. దాతలకు బాలసుబ్బయ్య కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైవీయూ అధ్యాపకులు డాక్టర్ టి. సురేష్ బాబు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రదర్శన

ప్రజాశక్తి- కడప అర్బన్

కడప శిల్పారామం సాంస్కృతి కళావేదిక మీద మిస్ఫా మూవీ వారి సహకారంతో మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల, వెంకటేశ్వాపురం మాధవరం -1 సిద్దవటం మండలానికి చెందిన విద్యార్థులు దేశభక్తి, శాస్త్రీయ, జానపద, సినీ జీతాలైన 'ఇదే మన భారతం, రాను బొంబాయి కి, రాదురా ఏ విజయం' అంటూ నృత్యాలు ప్రదర్శించారు. దేశనాయకులు ఫొటో ఫ్రేమ్‌లతో ఆ, అనే అక్షరం అమ్మకు నిదర్శంగా, ఈ ఈగ నిదర్శంగా ఆ విద్యార్థులు చేసిన ప్రదర్శనకు ప్రేక్షకులు ఎంతో మెచ్చుకున్నారు. తమ ఆనందాన్ని చప్పట్లు రూపంలో తెలిపారు. రిమ్స్ ఎస్ఐ సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని పేర్కొన్నారు. ట్రాఫిక్ నియమా నిబంధనలు గురించి తెలిపారు. కార్యక్రమాలను శిల్పారామం పరిపాలన అధికారి ఎస్.కృష్ణ ప్రసాద్ పర్యవేక్షించారు.

దేశభక్తి గీతానికి ప్రదర్శన ఇస్తున్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

పోరాటాల ఫలితమే నోటిఫికేషన్ విడుదల

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్రంలో నిరుద్యోగులు ఐక్యంగా అనేక పోరాటాలు చేయడం ద్వారానే డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల సాధ్యం అయిందని, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన డిఎస్‌సి నోటిఫికేషన్ డివైఎఫ్ఐ స్వాగతిస్తున్నట్లు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముడియం. చిన్ని, వీరనాల శివకుమార్ తెలిపారు. ఆదివారం జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిఎస్‌సి నోటిఫికేషన్‌కు సంబంధించి భవిష్యత్తులో అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. రాష్ట్రంలో 30వేలకు పైగా ఉపాధ్యాయ ఖాళీలు ఉండగా కేవలం 16,347 పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్ ఇవ్వడం నిరుద్యోగులను తీవ్ర నిరాశకు గురిచేసిందన్నారు. జిల్లాకు ఓకే పేపర్ ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రెగ్యులర్ నోటిఫికేషన్ లేనందున అభ్యర్థులకు వయోపరిమితి సడలింపు పై రాష్ట్ర ప్రభుత్వం పునర్ ఆలోచించాలని కోరారు. పిఇటి పోస్టుల సంఖ్య పెంచాలని డిమాండ్ చేశారు. పరీక్ష గడువు 70రోజులు అయినా పెంచాలని కోరారు. పోరాటాల సందర్భంగా డివైఎఫ్ఐ నాయకులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు విశ్వనాథ్, నాయకులు మేరీ కుమార్ పాల్గొన్నారు.

అర్హులందరికీ పట్టాలు మంజూరు చేస్తాం

ప్రజాశక్తి-కాశినాయన : పేదలు సాగు చేసుకుంటున్న భూములకు అర్హత కలిగి ఉంటే వారికి తప్పక పట్టాలు ఇప్పించి న్యాయం చేస్తానని బద్వేలు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ పేర్కొన్నారు నాయనపల్లె పొలంలో కబ్జాకు గురైన భూమి తమది అంటూ వరికుంట్ల దళితులు ఆమె దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితులమైన తాము పదేళ్ల నుంచి నాయన పల్లె పొలంలో భూమి సాగు చేసుకుంటూ ఉంటే గత ప్రభుత్వంలో తమ భూములను తీసుకుని దౌర్జన్యంగా అక్కడి నుండి పోలీసులు, రెవెన్యూ అధికారలుతో తరిమి కొట్టారని ఆవేదన వ్యక్తం చేబూరు. వెంటనే ఆమె స్పందించి బద్వేల్ ఆర్‌డిఒతో మాట్లాడి అందరికీ పట్టాలు ఇచ్చేందుకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మండల టిడిపి ఇన్‌ఛార్జి బసిరెడ్డి రవీంద్రారెడ్డి మాట్లాడుతూ పేదలకు ఏ సమస్య వచ్చినా పరిష్కరించేందుకు రితీష్ రెడ్డి, విజయమ్మ సహకాంతో తనవంతు కృషి చేస్తానని చెప్పారు.

ఇంటి స్థలాలు ఇచ్చేందుకు కృషి

ప్రజాశక్తి -కడప అర్బన్

మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షులు బి. శ్రీనివాసులు

ఎన్‌జిఒ ఉద్యోగులకు త్వరలో ఇంటి స్థలాలు ఇచ్చేందుకు కృషి చేస్తామని ఎపి ఎన్‌జిఒ జిల్లా అధ్యక్షులు బి.శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం ఆర్‌టిసి గ్యారేజీ సమీపంలో ఉన్న ఎన్‌జిఒ కో-ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్ కడపలో సర్వ సభ్య సమావేశం అధ్యక్షులు లెక్కల కొండారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జమా ఖర్చులు, వివరించారు. సొసైటీకి అందరూ సహకరించాలని కోరారు. జిల్లా అధ్యక్షులు బి.శ్రీనివాసులు మాట్లాడుతూ డైరెక్టర్స్ అందరూ సహాకరించాలని, అభి వృద్ధికి తోడుపడాలని, స్థలం రాని మిగిలిన సభ్యులుకు రాష్ట్ర అధ్యక్షులు కె.వి.శివారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.విద్యా సాగర్ సహాకారంతో కచ్చితంగా స్థలాలు సాధిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో ఎన్‌జిఒ రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రసాద్ యాదవ్, జిల్లా కార్యదర్శి రవి కుమార్, సొసైటీ సొసైటీ పాలక వర్గ డైరెక్టర్స్, ఉమ్మడి కడప జిల్లాలోని తాలూకా అధ్యక్షులు, కార్యదర్శులు, పెన్షనర్స్ అసోసియేషన్ కార్యదర్శి రామమూర్తి నాయుడు, రిటైర్డ్ ఉద్యోగులు, సభ్యులు, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

మానవత సభ్యత్వ నమోదును జయప్రదం చేయండి

ప్రజాశక్తి - కడప అర్బన్

సమాజ హితాన్ని కాంక్షిస్తూ ప్రజలకు చేరువవుతున్న మానవతా సంస్థ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ జయప్రదం చేయాలని మానవత వ్యవస్థాపక అధ్యక్షులు ఎం. రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం మానవతా సంస్థ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యత్వాలు కొనసాగించాలని, ప్రతి ఒక్కరూ రూ.600 చెల్లిస్తే ఆ డబ్బు ఎంతోమంది పేదవారికి ఉపయోగపడుతున్నదని చెప్పారు. ప్రతి రూపాయి సమాజ హితం కోసం ఖర్చు పెడుతున్నామని తెలిపారు. స్వచ్ఛందంగా ముందుకు వస్తూ సంస్థ పురోభివృద్ధికి సాయపడుతున్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో పిఆర్ఒ సుబ్బరాయుడు, సభాధ్యక్షత సుబ్బారెడ్డి, కేంద్ర కమిటీ డైరెక్టర్ రాటాల గోపి, ఆత్మీయ సహకార కమిటీ చైర్మన్ సుబ్రహ్మణ్యం, నాగార్జున మహిళా డిగ్రీ కళాశాల వ్యవస్థాపకులు బైరెడ్డి రామకృష్ణారెడ్డి, రక్తదాన విభాగం అధ్యక్షులు శివశంకర్ రెడ్డి, అకౌంట్స్ కమిటీ సభ్యులు చలమారెడ్డి, సుబ్బయ్య, మహిళా సభ్యురాలు నీలవేణి పాల్గొన్నారు.

పిడుగుపాటుకు యువకుడు దుర్మరణం

ప్రజాశక్తి - పెద్దముడియం

కుమారుడి మృతదేహం వద్ద రోధిస్తున్న తల్లిదండ్రులు

పిడుగుపాటుకు గురై యువకుడు దుర్మరణం చెందిన ఘటన ఆదివారం చిన్నముడియంలో చోటు చేసుకుంది. వాతావరణంలో అకాల మార్పులు సంతరించుకున్న నేపథ్యంలో ఆదివారం చిన్నముడియం గ్రామంలో ఉరుములు మెరుపులతో వర్షం ప్రారంభమైంది. పొలంలో పనిచేస్తున్న దండు భాను (24) అనే యువకుడుపై పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. చేతికి అందివచ్చిన కొడుకు మృతి చెందటంతో కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంత మయ్యారు.సమాచారం అందుకున్న పోలీసులు ఘటానాస్థలికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

లాడ్జీలలో పోలీసుల తనిఖీలు

ప్రజాశక్తి - కడపఅర్బన్

ఎస్‌పి ఇజి అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు ఆదివారం జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు, సిబ్బంది విస్తృతంగా లాడ్జీలను తనిఖీ చేశారు. లాడ్జీలలో పోలీసులు ప్రతి గదిని క్షుణ్ణంగా తనిఖీ చేసి, లాడ్జీలలో బస చేసిన వ్యక్తులను ప్రశ్నిస్తూ వారి వివరాలపై ఆరా తీశారు. లాడ్జీలలోని రిజిస్టర్‌ను పరిశీలించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లాడ్జీల నిర్వాహకులు అనుమానితులను గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. లాడ్జి పరిసరాలు స్పష్టంగా కనిపించేలా సి.సి కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని నిర్వాహకులకు సూచించారు.

అరుళయ్య సేవలు పదిలం

ప్రజాశక్తి- కడప అర్బన్ : ఉమ్మడి కడప, చిత్తూరు జిల్లాల కతోలిక సంఘంలో బిషప్ అరుళయ్య చేసిన సేవలు ఎప్పటికీ పదిలమేనని, శాంతి సేవా సొసైటీ వ్యవస్థాపకులు మడగలం ప్రసాద్ అన్నారు. ఆదివారం అరుళయ్య 48వ బిషప్ పట్టాభిషేక వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని, శాంతి సేవా సొసైటీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి, మరియాపురం సెయింట్ మేరిస్ కథిడ్రాల్ పెద్ద చర్చిలోని ఆయన ఘూట్‌లో బృంద సభ్యులతో కలసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప కతోలిక మేత్రాసనానికి మొదటి బిషప్ అరుళయ్య ఎనలేని సేవలను చేశారని పేర్కొన్నారు. ఆయన చేసిన సేవలు ఎప్పటికీ పదిలంగా కడప జిల్లా ప్రజలకు సాక్షంగా, చిరకాలం నిలిచిపోతున్నాయని, కడపలో క్రైస్తవ్యం ఇంతలా వ్యాప్తి చెందడానికి అరుళయ్య మూల కారకుడని అభివర్ణించారు.కార్యక్రమంలో సొసైటి సభ్యులు అమృత, స్రవంతి పావని, లక్ష్మీదేవి, సత్య నారాయణరెడ్డి జోజప్ప, ఠాగూర్ అరుళయ్య పాల్గొన్నారు.

వైసిపి, టిడిపి దొందూ దొందే : పిసిసి

ప్రజాశక్తి - కడప

వైసిపి, టిడిపి రాష్ట్రానికి రాహు కేతువులుగా దాపురించాయని, దొందూ దొందే అని పిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్ తులసి రెడ్డి ధ్వజమెత్తారు. ఆదివారం కడప జిల్లా కాంగ్రెస్ కార్యాలయం ఇందిరా భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలోఆయన మాట్లాడారు. జగన్ అర చేతిలో వైకుంఠం చూపిస్తే చంద్రబాబు కైలాసం చూపిస్తున్నారని అన్నారు. రాష్ట్ర పరిస్థితి పెనం మీద నుండి నిప్పుల పొయ్యిలో పడ్డట్టు తయారైందని అన్నారు. వైసిపి ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల, అరాచక, ఆటవిక, మద్య, జూద, డ్రగ్, గంజాయి ఆంధ్ర ప్రదేశ్‌గా తయారు చేసి వెళ్లి పోయింది. అతనికంటే ఘనుడు ఆచంట మల్లన్న అన్నట్లుంది చంద్ర బాబు ప్రభుత్వం పని తీరు అన్నారు. మండలానికి నాలుగు మద్యం షాపులు నలభై బెల్టు షాపులు అన్నట్లు మద్యం పాలసీ తయారైందని వాపోయారు. పాఠశాలల్లో కూడా డ్రగ్స్, గంజాయి ప్రవేశించాయి. బాదుడు కార్యక్రమం భారీగా సాగుతోంది. సర్దుబాటు ఛార్జీల పేరుతో రు 15,485 కోట్ల అదనపు భారం మోపింది. సూపర్ సిక్స్ హామీలు సూపర్ ఫ్లాప్ అయ్యాయి. నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి ఇప్పటివరకు పైసా కూడా ఇవ్వలేదు.యువతను నమ్మించి మోసగించడం జరిగింది అని ఘాటుగా విమర్శించారు.తల్లికి వందనం పథకం తల్లికి మోసం పథకంగా మారిందని వాపోయారు. కడప జిల్లాలో సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు కర్మాగారం రావాలన్నా, రాయలసీమకు, ఉత్తరాంధ్రకు బుందేల్ ఖండ్ తరహా ప్రత్యేక ప్యాకేజీ రావాలన్నా ,సంజీవిని లాంటి ప్రత్యేక హోదా రావాలన్నా గ్రాండ్ ఓల్డ్ పార్టీ అయిన కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి రావాలని ఈ సందర్భంగా ఆయన అన్నారు. అన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులుగా నియ మితులైన సిరాజుద్దీన్, కదిరి ప్రసాద్ గౌడ్, కార్యదర్శి భువన్ ఏకాదశి రెడ్డిని సన్మానించారు. సమావేశంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు సిరాజుద్దీన్, కదిరి ప్రసాద్ గౌడ్, కార్యదర్శి భువన్ ఏకాదశి రెడ్డి, ప్రముఖ సంఘ సేవకులు సయ్యద్ సలావుద్దీన్, పిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సత్తార్, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర కార్యదర్శి సంగటి చిన్న సుబ్బారెడ్డి, ఎస్‌సి సెల్ రాష్ట్ర కన్వీనర్ శాంతయ్య, ఓబయ్య , శ్యామలమ్మ, నాగరత్న గౌడ్, షేక్ సుల్తాన్ మొహిద్దిన్, షేక్ అమానుల్లా, ఉత్తన్న, అమర్, అబ్దుల్ రషీద్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న తులసిరెడ్డి

తిరుణాలలో ప్రత్యేక ఆకర్షణ కుంకుమ బండి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలోని అంకాలమ్మ గూడూరులో వెలసిన శ్రీఅంకాలమ్మ అమ్మవారి తిరుణాల సందర్భంగా కుంకుమ బండి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆదివారం కడప నాగయపల్లి నుంచి కుంకుమ బండి గ్రామోత్సవం నిర్వ హించారు. ప్రతి ఏటా అంకాలమ్మ గూడూరులోజరిగే తిరుణాలకు గ్రామంలో ప్రతి ఇంటి నుంచి కుంకుమ, చీరను అందజేస్తారు. అనంతరం బండిని ప్రత్యేక చీరలతో అలంకరించారు. బండిని కోలాటాలు, చెక్కభజనల నడుమ స్థానికులు ప్రదర్శనగా అంకాలమ్మగూడూరు తిరుణాలకు భక్తి శ్రద్ధలతో తీసుకొచ్చారు. పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కుంకుమ బండి

సిద్ధారెడ్డిపల్లెలో బోనాలు సమర్పిస్తున్న గ్రామస్తులు

ఉత్సాహంగా బోనాలు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని సిద్ధారెడ్డిపల్లె గ్రామంలో ఆదివారం గ్రామ దేవత పెద్దమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో పెద్దమ్మ తల్లిని పూజించి బోనాలు, జంతుబలులు ఇచ్చారు. నాగాయపల్లి గ్రామంలో కూడా గ్రామదేవతకు భోనాలు సమర్పించి పండుగ నిర్వ హించుకున్నారు. వేసవిలో గ్రామాలలో గ్రామ దేవతలను పూజించడం ఆన వాయితీగా వస్తోంది. అందులో భాగంగా ఆదివారం జాతరను నిర్వహించారు.

మైదుకూరులో.. మైదుకూరు వనిపెంట రోడ్డులో వెలసిన అంకాలమ్మ తల్లి తిరుణాలను ఘనంగా నిర్వహించారు. బోనాలు, సూడిబండ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గుండు ఎత్తే పందాలను నిర్వహించారు. సోమవారం కూడా రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేపడుతున్నారు.

ఘనంగా చెన్నారెడ్డిపల్లెలో జాతర

ప్రజాశక్తి - ముద్దనూరు

చెన్నారెడ్డిపల్లె గ్రామంలో 12ఏళ్ల తర్వాత ఆదివారం నిర్వహించిన పెద్దమ్మ తల్లి జాతర వేడుకలు కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. జాతరకు మండల నాయకులు కటికరెడ్డి మధుసూదనరెడ్డి, యువ నాయకులు కటికరెడ్డి గుణవంతరెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. పలువురు ప్రముఖులు, నాయకులు, గ్రామ ప్రజలు వేడుకల్లో పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్టాపనలో అపశృతి

రెండుగా విడిపోయిన ధ్వజస్తంభం

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల పరిధిలోని తుడమలదిన్నె గ్రామంలో అంకాలమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట పూజా కార్యక్రమాల్లో అపశృతి చోటుచేసుకుంది. ఆదివారం ధ్వజ స్తంభ ప్రతిష్ట కార్యక్రమం జరగాల్సి ఉండగా ధ్వజస్తంభాన్ని ప్రతిష్టించే క్రమంలో స్తంభం రెండుగా విరిగింది. పెద్ద ప్రమాదం తప్పింది. అంకాలమ్మ తిరుణాలకు సంబంధించి ఆలయానికి చెందిన ఆర్థిక పరమైన విషయం ఇటీవల పోలీస్ స్టేషన్ వరకు చేరింది. పోలీసులు ఇరువర్గాల వారిని పిలిచి సమస్యను పరిష్కరింపజేశారు.

స్కిప్పింగ్ ఆడుతున్న బాలికలు

ఘనంగా ఈస్టర్ వేడుకలు

ప్రజాశక్తి - ముద్దనూరు

ఏసు క్రీస్తు పునరుత్థానం పురస్కరించుకుని ఆదివారం మండలంలోని అన్ని చర్చిల్లో క్రైస్తవులు ఈస్టర్ పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక సిఎస్ఐ చర్చిలో రెవరెండ్ డ్యానియేల్ విన్సెంట్‌కుమార్, సిఎస్ఐ (ఎస్‌సిటి)లో రెవరెండ్ సంతోష్ ప్రసన్న రావ్, ఆర్‌సిఎంలో పాదర్ మరిరెడ్డి, మన్నాహెల్లో ప్రార్ధన మందిరంలో పాస్టర్ ప్రభాకర్, బ్రదర్ స్యామ్యూల్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఎలిమ్ కాంపౌండ్‌లోని చర్చిలో రెవరెండ్ డ్యానియేల్ విన్సెంట్‌కుమార్ ఈస్టర్ ప్రాముఖ్యత వివరించారు. చిన్నారులు, యువకులు, మహిళలు రంగులు చల్లుకుంటూ, డ్యాన్సులు వేస్తూ సంబరాలు జరుపుకున్నారు. సాయంత్రం కబడ్డీ, రన్నింగ్, లాంగ్ జంప్ ఆటల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బోనం సరళ, ఎంపిటిసి ఇంద్రాణి, సంఘ సంఘస్తులు, మహిళలు పాల్గొన్నారు.

ముస్లింలను నమ్మించి మోసం చేసిన వైసిపి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

వైసిపి ముస్లింలను నమ్మించి మోసం చేసిందని, వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు విషయంలో టిడిపిది ఒకే వైఖరి అని, పొత్తులో ధర్మంగా నూరు శాతం మద్దతు ఇవ్వడం జరిగిందని నియోజకవర్గ ఇన్‌ఛార్జి మారెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసిపిలా లోక్‌సభలో వ్యతిరేకించడం, రాజ్యసభలో అనుకూలంగా ఓటు వేసి ద్వంద్వ వైఖరిని టిడిపి అవలంబించలేదన్నారు. వక్ఫ్ బోర్డు ఆస్తుల విషయంలో వైసిపి ముస్లింలను మభ్య పెట్టే ప్రయత్నాలు చేస్తోందన్నారు. రాష్ట్ర ప్రజల కోసం కేంద్ర ప్రభుత్వానికి మద్దతు ఉన్నామన్నారు. ముస్లింలకు ఇబ్బంది కలిగితే రాష్ట్ర ప్రయోజనాలు కూడా పక్కనపెట్టి వారి తరఫున ముఖ్యమంత్రి, తాము పోరాడుతామన్నారు. వక్ఫ్ బోర్డు ఆస్తుల విషయంలో ముస్లింల అభ్యున్నతికి పాటుపడే విధంగా ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు కొరివిది ప్రసాద్, రాష్ట్ర హజ్‌కమిటీ డైరెక్టర్ మహబూబ్ బాషా, ఖాసీం, పులివెందుల టిడిపి మాజీ పట్టణ అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి అబ్బుగుట్ట రవితేజరెడ్డి పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బిటెక్ రవి

పల్లె సీమలకు రహదారుల శోభ

మూడు గ్రామాలకు లింక్ రోడ్డు సౌకర్యం

ప్రజాశక్తి - సింహాద్రిపురం

గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన పనులను కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రారంభించి పూర్తి చేయడంతో పల్లె సీమలకు రహదారుల శోభ నెలకొంది. గతంలో ఈ రహదారుల వెంట ప్రయాణం చేయాలంటే ప్రజలు ఇబ్బందిపడే పరిస్థితి. గత ప్రభుత్వ హయాంలో మండలంలోని ఐదు పనులకు సంబంధించి ఒకే ప్యాకేజీ కింద ఆసియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్‌వెస్ట్‌మెంట్ బ్యాంక్ గ్రాంట (ఏఐఐబి) కింద టెం డర్లను ఆహ్వానించారు. ఈ టెండర్లలో పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు చేయకపోవడంతో నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం మొదటగా హిమకుంట్ల-అంకెవానిపల్లి గ్రామాల మధ్య 2.7 కిలోమీటర్ల తార రోడ్డును రూ.1.80 కోట్లతో పనులు పూర్తి చేశారు. అనంతరం గురజాల-వెంకటంపల్లె గ్రామాల మధ్య 1.3 కిలో మీటర్లు రూ 1.20 కోట్లతో పనులు ఇటీవలే పూర్తి చేశారు. గురజాల-వెన్నపూస పల్లె గ్రామాల మధ్య 5 కిలోమీటర్లు రూ.3.5 కోట్లతో తార రోడ్డు పనులు పూర్తికావచ్చాయి. మరో రెండు భానుకోట-తెలికి, బిదినంచర్ల-దంతరపల్లె గ్రామాల మధ్య పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయి.

గురజాల-వెంకటం పల్లి గ్రామాల మధ్య వేసిన రోడ్డు

కొన్నేళ్ల నిరీక్షణ.. నేటికి సాకారం

కొన్నేళ్లుగా తమ గ్రామానికి తారు రోడ్డు ఏర్పాటు చేయాలనే నిరీక్షణ నేటికి సాకారమైందని ఆ గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సొంత నియోజకవర్గమైన పులివెందులకు సమీపాన ఉన్న వెంకటంపల్లి గ్రామం అనంతపురం జిల్లా పరిధిలో ఉంది. ఈ గ్రామం పేరుకి అనంతపురం జిల్లాలో ఉన్నప్పటికీ పులివెందుల నియోజవర్గంలోకి వచ్చి జిల్లా కేంద్రానికి, మండల కేంద్రానికి వెళ్లాల్సి ఉంటుంది. అలాంటి గ్రామానికి నేడు తార రోడ్డు రావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

లింక్ రోడ్లతో ప్రయాణం.. సులభతరం

గ్రామీణ ప్రాంతాల్లో లింక్ రోడ్లు ఏర్పాటుతో ప్రయాణం సులభతరంగా మారనుంది. గతంలో తార రోడ్డు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడేవారు. తార రోడ్డు నిర్మాణం పూర్తి కావడంతో ప్రయాణం సులభతరంగా మారింది.

- రాంప్రసాద్ రెడ్డి, పిఆర్ డిఇ, పులివెందుల

ఘనంగా చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు

భారీ కేక్‌ను కట్ చేస్తున్న ఎమ్మెల్యే మాధవి

ప్రజాశక్తి - కడప అర్బన్

తెలుగుదేశం పార్టీ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 75వ జన్మదినోత్సవాన్ని కడపలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. నిర్మాణంలో ఉన్న టిడిపి జిల్లా కార్యాలయ ఆవరణలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు గోవర్ధన్ రెడ్డి, బాలిశెట్టి హరిప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన 75 కిలోల భారీ కేకును ఎమ్మెల్యే మాధవి, రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి కట్ చేశారు. **38వ డివిజన్ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి షేక్. మహమ్మద్ హనీఫ్ ఆధ్వర్యంలో** నగరంలోని చిలకల బావి వద్ద ఉన్న వారి కార్యాలయంలో చంద్రబాబు 75 జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో యువ నాయకులు ఆసిఫ్, ఫయాజ్, ఇలియాస్, సోహెల్, ఆదిల్, ఇంతియాజ్, ఇర్షద్, అబ్దుల్, ఆసిఫ్ పాల్గొన్నారు. **ఒంటిమిట్టలో :** తెలుగుదేశం

ఒంటిమిట్టలో కేక్ తినిపించుకుంటున్న నాయకులు

పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు 75వ జన్మదినోత్సవ వేడుకలు టిడిపి మండల అధ్యక్షులు గజ్జల నరసింహారెడ్డి, స్పెషల్ క్లాస్ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ ఎస్.వి. రమణ, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి బొబ్బిలి రాయుడు, బిసి సెల్ అధ్యక్షులు ఎం.వి రమణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తెలుగు తమ్ముళ్ల మధ్య పెద్ద ఎత్తున కేకు కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ః తీఎం చంద్రబాబు నాయుడు కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. టిడిపి మండల శాఖ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మౌలాలి, చామ సుబ్బారెడ్డి డాక్టర్ శివకుమార్, జి.ఆదినారాయణ, హరినాథ్ రెడ్డి, శివారెడ్డి, చింతగింజల సుబ్రమణ్యం, పివి రమణ, జయసింహారెడ్డి, నాగరాజా, పత్తి సుబ్బరాయుడు, హుస్సేన్, పీరా, రోశయ్య, మధు, శ్రీనివాసులు, ఐవారయ్య, కత్తి చంద్ర, శివ, జై కృష్ణ ప్రసాదు, వెంకటసుబ్బారెడ్డి, లక్ష్మి రెడ్డి, రామాంజనేయులు, మోదుగుల వెంకట సుబ్బయ్య పాల్గొన్నారు. **కాశినాయన :**

కాశినాయన : కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే విజయమ్మ

మండలంలోని వరికుంట్ల కస్తూరిబా బాలికల పాఠశాలలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలను టిడిపి నాయకులు బసిరెడ్డి రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులతో కలసి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బద్వేల్ మాజీ ఎమ్మెల్యే విజయమ్మ హాజరయ్యారు. విద్యార్థులతో కలసికేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో కూటమి అభ్యర్థి బొజ్జ రోషన్న, టిడిపి నాయకులు రాజారెడ్డి ,పోలిరెడ్డి, రామ సుబ్బారెడ్డి, సీతా వెంకటసుబ్బయ్య, గురివిరెడ్డి, విజయ కుమార్ రెడ్డి, కృష్ణారెడ్డి, నరసింహారెడ్డి కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. **కమలాపురంలో :** స్థానిక టిడిపికార్యాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి

కమలాపురంలో కేక్ తినిపించుకుంటున్న నాయకులు

జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి హాజై కేక్ కట్ చేసి అభిమానులకు, నాయకులకు, కార్యకర్తలకు తినిపించారు.అనంతరం కమలాపురం నగర పంచాయతీలోని అనాథ పిల్లలకు అన్నదానం చేశారు.ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు ,బ్రెడ్ పంచి పెట్టారు. జిల్లా మైనారిటీ అధ్యక్షుడు ఖాదర్ బషా, కమలాపురం తెలుగు దేశం పార్టీ మండల కన్వీనర్ రాఘవరెడ్డితోపాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **వేంపల్లె :** ముఖ్యమంత్రి చంద్రబాబు పుట్టినరోజు వేడుకలను టిడిపి నాయకులు ఘనంగా నిర్వహించారు. నాలుగు రోడ్ల కూడలిలో టిడిపి మండల కమిటీ ఆధ్వర్యంలో 75 కిలోల కేక్‌ను తుంగభద్ర హైలెవెల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి, టిడిపి మండల పరిశీలకుడు రఘునాథ్‌రెడ్డి కట్ చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల పరిశీలకుడు రఘునాథ్‌రెడ్డి, మండల కన్వీనర్ చంద్ర ఓబుల్ రెడ్డి, టిడిపి ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, బాలస్వామిరెడ్డి, రామగంగిరెడ్డి, వేమ కుమార్, మహమ్మద్, పీరా సాహెబ్, వీరభద్ర, డక్కా రమేష్, అల్లాబకష్, బిజెపి నాయకులు సుష్మాతోపాటు పలువురు టిడిపి నేతలు భారీ సంఖ్యలో హాజరైనారు. **ముద్దనూరు :** ముఖ్యమంత్రి చంద్రబాబు పుట్టినరోజును టిడిపి నాయకులు ఘనంగా నిర్వహించారు. బస్టాండ్ వద్ద కేక్ కట్ చేశారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **ఖాజీపేట :** ముఖ్యమంత్రి, టిడిపి

ఖాజీపేట : ఎమ్మెల్యేకు కేక్ తినిపిస్తున్న నాయకులు

జాతీయ అధ్యక్షులు చంద్రబాబు పుట్టినరోజు కార్యక్రమాన్ని ఆదివారం ఆపార్టీ శ్రేణులు, అభిమానులు, నాయకులు, కార్యకర్తలు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. స్థానిక మైదుకూరు రోడ్డులోని సాయిబాబా ఆలయంలో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు సందుల నాగశివారెడ్డి, పుల్లయ్య నాయుడు, పత్తూరు ఉప సర్పంచ్ ముత్తూరు రమణ, త్రిపురవరం హరినాథ్‌రెడ్డి, సరిటల వీరయ్య, సర్పంచ్ కొంగాని వెంకటసుబ్బయ్య యాదవ్, ఎంపీటీసీ చంద్రభాస్కర్ రెడ్డి, రెడ్యం వెంకట్రాంరెడ్డి, రామనాయుడు, బ్రహ్మనాయుడు, కమలాపురం గౌస్, రావులపల్లె ఉప సర్పంచ్ దుగ్గిరెడ్డి లక్ష్మిరెడ్డి పాల్గొన్నారు. **చక్రాయపేట :** మండలంలోని ప్రతి గ్రామంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో టిడిపి మండల ఇన్‌ఛార్జి తాళ్లపల్లె మహేశ్వర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. చిలేకాంపల్లిలో మావుళ్లమ్మ తల్లిని దర్శించుకుని గడ్డమవారిపల్లి గ్రామ టిడిపి కార్యకర్తలు రవీంద్రా రెడ్డి, సుబ్బారెడ్డి, ప్రసాద్ రెడ్డి, రమణారెడ్డి, ఆనంద్, శిద్దారెడ్డి ఏర్పాటు చేసిన విందు భోజనంలో పాల్గొన్నారు. పులివెందుల ఇన్‌ఛార్జి బీటెక్ రవి, మహేశ్వర్‌రెడ్డి సురభి గ్రామం వరికుంటపల్లి పర్యటనలో నీటి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సురభి గ్రామ ఉపసర్పంచ్ దాసరి ఆంజనేయులు, చిలేకాంపల్లె మావిరెడ్డిగారి మావిరెడ్డి, మారెళ్ళ మడక రఘునాథరెడ్డి, టిడిపి కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. **జమ్మలమడుగు రూరల్ :** చంద్రబాబుపుట్టినరోజు సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు టిడిపి రాష్ట్ర కార్యదర్శి జంబాపురం వెంకటరమణారెడ్డిః, మార్కెట్ యార్డ్ చైర్మన్ సింగంరెడ్డి నాగేశ్వర్‌రెడ్డి, కూటమి నేతలు ఆదివారం పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వేపరాల కుమార్, చిన్న పశుపుల శ్రీనివాసులు రెడ్డి, కూటమి నేతలు పాల్గొన్నారు. హైదరాబాద్ ఎన్టీఆర్ భవన్‌లో చంద్రబాబు జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో జమ్మలమడుగు నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్ సుబ్బరామిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **దువ్వూరు :** దువ్వూరు మూడు రోడ్ల కూడలిలో ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుల బోరెడ్డి రమణారెడ్డి, పట్టణ అధ్యక్షులు పాపినేని రాంబాబు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ప్రతాప్ నాయుడు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పాల్గొన్నారు. **పులివెందుల రూరల్ :** పులివెందుల టిడిపి కార్యాలయంలో శనివారం చంద్రబాబు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. 75 కిలోల కేకును బీటెక్ రవి, టిడిపి నాయకులు కట్ చేసి, అక్కడ ఉన్నవారికి పంచి పెట్టారు, కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షుడు అన్నారెడ్డి ప్రసాద్‌రెడ్డి, మాజీ పట్టణ అధ్యక్షుడు వెంకట రామిరెడ్డి, బిజెపి నాయకులు శశిభూషణ్‌రెడ్డి, సంజీవరెడ్డి, హజ్ కమిటీ మెంబర్ మా బాషా, నల్లగారి భాస్కర్ రెడ్డి, గంగాధర్ రెడ్డి పాల్గొన్నారు.

వేంపల్లెలో కేక్ తినిపించుకుంటున్న టిడిపి నాయకులు

రైల్వే అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎడిఆర్ఎం సుధాకర్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ప్రయా ణికులకు పురుషులు, మహిళలు, లోకో పైలెట్, గార్డ్స్‌కు వేర్వేరుగా విశ్రాంతి గదు లను నిర్మిం చామన్నారు. లోకో పైలెట్లకు సూచనలు ఇచ్చే గదితోపాటు లైబ్రరీ ఏర్పాటు చేశామన్నారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జి పనులు జరుగుతున్నాయని, జూన్ చివరికి పూర్తవుతాయని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ డిఇఇ వీరయ్య, ఉన్నత స్థాయి అధికారులు సిద్దు సాహెబ్, రాధాకృష్ణ, ఆర్పిఎఫ్ సిఐ శ్రీనివా సులు, చీఫ్ లోకో ఇన్‌స్పెక్టర్ బాబాజాన్, స్థానిక రైల్వేఅధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎడిఆర్ఎం సుధాకర్

ఎస్‌సి వర్గీకరణ విజయోత్సవ ర్యాలీ

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మాదిగ, మాదిగ ఉపకులాల చిరకాల ఆకాంక్ష ఎస్‌సి వర్గీకరణను అమలుపరుస్తూ ఆర్డినెన్స్ జారీ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల నియోజకవర్గ ఇన్‌ఛార్జి వై.చిన్నయ్య మాదిగ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక పెదపసుల మోటు నుంచి పాత బస్టాండ్‌లోని అంబేద్కర్ విగ్రహం వరకు విజయోత్సవ ర్యాలీని నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. తమ అధినేత మందకృష్ణ మాదిగ, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కేక్ కట్ చేశారు. స్వీట్స్ పంపిణీ చేసి తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంఇఎఫ్ జిల్లా అధ్యక్షులు పిచ్చికె బాబు మాదిగ, ఎంఈఎఫ్ నియోజకవర్గ అధ్యక్షులు కె.బాల ఓబయ్య, ఎంఎస్పి సీనియర్ నాయకులు పుట్టా రవి, బొంతల ఓబులేసు, వెంకటసుబ్బయ్య, సుబ్బగాళ్ల నరసింహులు, మారెన్న, సహదేవుడు, ఆర్.సుబ్బరాయుడు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల పట్ల అవగాహన ఉండాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

మహిళలు అగ్ని ప్రమాదాల పట్ల అవగాహన కలిగి ఉండాలని రఘునాథ్ తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా స్థానిక ఎర్రన్న కొట్టాలలో ఎల్పిజి గ్యాస్ వాడే విధానాన్ని గూర్చి మహిళలకు అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా డిప్యూటీ తహశీల్దార్ అజయ్ కుమార్ పాల్గొన్నారు. కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది. స్థానిక మహిళలు పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనం నడిపితే చర్యలు

ప్రజాశక్తి - దువ్వూరు

దువ్వూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో పలు వాహనాలను ఆదివారం ఎస్ఐ వినోద్‌కుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసు కుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్‌స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న జి.శివకుమార్

నేడు కలెక్టరేట్ వద్ద మహాధర్నా

వ్యవసాయం కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జి.శివకుమార్

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

ఉపాధి హామీలోని సమస్యల పరిష్కారం కోసం ఈనెల 21న కలెక్టరేట్ వద్ద మహాధర్నా చేపట్టామని, జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా బ్రహ్మంగారిమఠం సిపిఎం కార్యాలయంలో ఆదివారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా జి.శివకుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వల్ల ఉపాధి హామీ చట్టానికి ప్రమాదం ముంచుకొచ్చిందన్నారు. ఈ పథకానికి నిధులు తగ్గించి ఇకనుండి కూలీలు రెండు పూటలా పనిచేయాలని, వేసవి వేతనం రద్దు చేసినట్లు ప్రకటించిందన్నారు. కూలీలు పని కోరి పోకపోతే ఆ పని దినాలు రద్దు చేస్తామని చెబుతోందన్నారు. పని ఒత్తిడితో కూలీలే మాకొద్దు బాబోయ్ అనేలా కేంద్ర ప్రభుత్వం దుర్మార్గమైన కుట్రకు పాల్పడిందని విమర్శించారు. కూలీల కోసం వచ్చిన నిధులను కాంట్రాక్టర్లు, దళారులకు కట్టబెట్టడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సిద్ధమయ్యాయని తెలిపారు. ఎన్నో ఏళ్లగా పోరాడే సాధించుకున్న చట్టం ఇది.. ఎవరో మనకు పెట్టిన బిక్ష కాదు.. ఇది మన హక్కు కనుక ఈ చట్టాన్ని కాపాడుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్, ఆంజనేయులు, చిన్నబ్బి పాల్గొన్నారు.

చట్ట సవరణతో స్వేచ్ఛ, సమానత్వానికి భంగం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

వక్ఫ్ చట్ట సవరణతో స్వేచ్ఛ, సమానత్వానికి భంగం కలుగుతుందని సిపిఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ అన్నారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. చట్ట సవరణ బిల్లు 2025 ఏప్రిల్ 2న లోక్‌సభ, రాజ్యసభలో నెగ్గిందన్నారు. 8న కేంద్ర ప్రభుత్వ విజిట్ నోటిఫికేషన్ ద్వారా వక్ఫ్ బోర్డు సవరణ చట్టం అమలులోకి వచ్చిందన్నారు. ఈ నేపథ్యంలో మైనారిటీ హక్కుల సంస్థలు వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగ మౌలిక నిర్మాణంపై దాడిగా పరిగణిస్తూ సుప్రీంకోర్టులో సత్వర న్యాయం కోసం ఆశ్రయించారన్నారు. ఇందుకు విచారణకు సుప్రీంకోర్టు అంగీకరించిందన్నారు. భారత రాజ్యాంగం దేశ పౌరులందరికీ కల్పించిన స్వేచ్ఛ, సమానత్వాన్ని కొత్త చట్టంతో భంగం కలుగుతుందని ముస్లిం మైనారిటీల హక్కులను హరించే ప్రమాదకరంగా ఉందన్నారు. వాటి ఆస్తులను 52 కార్పొరేట్ సంస్థలకు అప్పగించాలనే ఆలోచనగా ఉందన్నారు. ఇది బిజెపి ఆలోచనగా ఉందనే ఆరోపణలు బలంగా వినపడుతున్నాయన్నారు. కడప ప్రెస్‌క్లబ్‌లో సోమవారం నిర్వహించే రౌండ్ టేబుల్ సమావేశాన్ని పెద్ద ఎత్తున జయప్రదం చేయాలని సత్యనారాయణ కోరారు. సమావేశంలో మహబూబ్ బాషా, గౌస్ బాషా పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సత్యనారాయణ

పరిసరాలను శుభ్రం చేస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

పరిసరాల శుభ్రతలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

మండలంలోని గోపవరం పంచాయతీ పరిధిలో ఉన్న శ్రీవెంకటేశ్వర పశు వైద్య కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఇంటర్న్ షిప్‌లో భాగంగా స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆదివారం కాలేజి పరిసరాలు శుభ్రం చేశారు. ఈ సందర్భంగా వారు కళాశాల పశువుల ఫాంలో ఉన్న వ్యవసాయ క్షేత్రంలో బండలు, రాళ్లు, ఎండిపోయిన చెట్టు కొమ్మలు, ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగించారు. అనంతరం విద్యార్థులు ఫార్మా కంపెనీ ప్రతినిధులతో పశు ఔషధాల గురించి అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ ఇందిర, డాక్టర్ జ్యోతి, అధ్యాపకులు డాక్టర్ రేవతి, డాక్టర్ సమీరున్ పాల్గొన్నారు.

సిఎంఆర్ఎఫ్‌తో కుటుంబానికి ఆసరా

ప్రజాశక్తి - వేంపల్లె

ఆరోగ్యం కోసం డబ్బులను ఖర్చు చేసుకున్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో ఆసరాగా ఉంటుందని ఎమ్మెల్సీ సతీమణి భూమిరెడ్డి ఉమాదేవి పేర్కొన్నారు. సిఎంఆర్ఎఫ్ కింద మంజూరైన చెక్కులను ఆదివారం వేంపల్లెలోని ఆయా బాధితుల ఇంటి వద్దకు వెళ్లి ఉమాదేవి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు సిఎంఆర్ఎఫ్‌తో ఎందరో పేద ప్రాణాలను కాపాడుతున్నట్లు చెప్పారు. వేంపల్లెకు చెందిన రామడుగు పుల్లయ్యకు రూ.63 వేలు, కత్తులూరుకు చెందిన లక్కిరెడ్డి నాగతులసి రెడ్డికి రూ.30 వేలు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి జివి రమణ, డివి సుబ్బారెడ్డి, వేంపల్లె పట్టణ కన్వీనర్ రమేష్, వేమిరెడ్డి, ప్రకాష్, బొజ్జ మైసూరారెడ్డి, సతీష్, భానుకిరణ్, పోతిరెడ్డి శివ, మహేష్ పాల్గొన్నారు.

రోడ్డుపై మురుగును తొలగించండి

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక శ్రీరాంనగర్ ప్రాంతంలోని కాలేజీ రోడ్డులో పారుతున్న మురుగును తొలగించాలని ఆ ప్రాంత మహిళలు టిడిపి నేతలను కోరారు. ఆదివారం టిడిపి మండల పరిశీలకుడు రఘునాథ్‌రెడ్డి, తుంగభద్ర హైలైవెల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి, మండల కన్వీనర్ రామమునిరెడ్డి శ్రీరాంనగర్ ప్రాంతంలో పర్యటించారు. ఈ నేపథ్యంలో కాలేజీ రోడ్డులోని గంగమ్మ గుడి సమీపంలో ఉన్న మహిళలు మాకుమ్మడిగా టిడిపి మండల పరిశీలకుడు రఘునాథ్‌రెడ్డి, మండల కన్వీనర్ రామమునిరెడ్డిని చుట్టుముట్టి మురికి సమస్యను వారి దృష్టికి తెచ్చారు. 3 నెలల నుండి రోడ్డుపై మురుగునీరు నిల్వ ఉండడంతో దోమలు విపరీతంగా పెరిగి వ్యాధులు సోకుతున్నట్లు మహిళలు వాపోయారు. తహశీల్దార్, ఎంపిడిఒ, గ్రామ సచివాలయాలకు వెళ్లే రహదారి అని, వారు కూడా పట్టించుకోవడం లేదని ఫిర్యాదు చేశారు. రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ వారం రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పంచాయతీ అధికారులు కాలేజీ రోడ్డులోని గంగమ్మ గుడి సమీపంలో నిల్వ ఉన్న మురుగు నీటిని పరిశీలించాలని కోరారు. వేసవిలో తాగునీరు, పారిశుధ్యంపై ప్రత్యేకదృష్టి పెడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నేత వేమాకుమార్, ఈశ్వరయ్య, మహమ్మద్, డక్కా రమేష్ పాల్గొన్నారు.

సమస్యను రఘునాథ్‌రెడ్డికి వివరిస్తున్న మహిళలు